# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 19-09-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- గ్రామీణ నీటి సరఫరా, జల్ జీవన్ మిషన్ పథకాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు సమీక్ష నిర్వహించారు.

- దివ్యాంగుల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి వుందని కేంద్ర మంత్రి వీరేంద్ర కుమార్ అన్నారు.

- రాష్ట్రంలో 15 శాతం వృద్ధి రేటును సాధించడమే లక్ష్యంగా స్వర్ణాంధ్ర @ 2047 విజన్ డాక్యుమెంట్‌ను రూపొందిస్తున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ తెలిపారు.

- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు శ్రీకాకుళం జిల్లాలో పర్యటించనున్నారు.

- రాష్ట్రంలో అన్ని ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, ఆంధ్రప్రదేశ్ ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.

========================

రాబోయే మూడు సంవత్సరాల్లో ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా సురక్షిత నీటిని అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఈరోజు అమరావతి సచివాలయంలో గ్రామీణ నీటి సరఫరా, జల్ జీవన్ మిషన్ పథకాలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. నిరంతరాయంగా ఇంటింటికీ తాగునీరు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. 26 జిల్లాల్లో మొత్తం 95 లక్షల ఇళ్లకు కొళాయి కనెక్షన్ ద్వారా నీటిని అందించాల్సి ఉందని, ఇందులో 2019 ఆగస్టుకు ముందే 31.68 లక్షల ఇళ్లకు కొళాయి కనెక్షన్లు ఉన్నాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సమీక్షలో ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

========================

దివ్యాంగుల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి వుందని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖా మంత్రి వీరేంద్ర కుమార్ అన్నారు. విశాఖపట్నం ఏయూ మెరైన్ మైదానంలో 11 రోజుల పాటు జరిగే "జాతీయ స్థాయి దివ్య కళా మేళా"ను రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ తో కలిసి కేంద్రమంత్రి ఈరోజు ప్రారంభించారు. దివ్యాంగులు, దివ్యాంగ కళాకారులు రూపొందించిన, తయారు చేసిన వివిధ రకాల ఉత్పత్తుల ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఎన్డీఏ ప్రభుత్వం గత సంవత్సరాల్లో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిందనిఈ సందర్భంగా కేంద్ర మంత్రి వెల్లడిస్తూ....

(వాయిస్ 22 సెకన్లు)

=======================

రాష్ట్రంలో 15 శాతం వృద్ధి రేటును సాధించడమే లక్ష్యంగా స్వర్ణాధ్ర @ 2047 విజన్ డాక్యుమెంట్‌ను రూపొందిస్తున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ తెలిపారు. స్వర్ణాంధ్ర @ 2047 విజన్ డాక్యుమెంట్ రూప కల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై ఈరోజు రాష్ట్ర సచివాలయం నుండి కలెక్టర్లు, వివిధ అధికారులతో దృశ్య మాధ్యమం ద్వారా ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసమీక్షలో వికసిత్ భారత్-2047లో భాగంగా అభివద్ధి చెందిన ఆంధ్రప్రదేశ్ గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ డాక్యుమెంట్ ను రూపొందించి నవంబరు 1వ తేదీన ఆవిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు.

=======================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు శ్రీకాకుళం జిల్లా, ఇచ్ఛాపురం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజుల పూర్తయిన నేపథ్యంలో "ఇది మన ప్రభుత్వం" పేరిట కవిటి మండలం రాజపురం గ్రామంలో నిర్వహించే రచ్చబండ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. రేపటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 6 రోజులపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రగతిని ప్రతి ఇంటికి చేరవేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. అందులో భాగంగా ఈ కార్యక్రమాన్ని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

=======================

పర్యాటక రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఈరోజు రాజమహేంద్రవరంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... రాష్ట్రంలో అన్ని ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, ఆంధ్రప్రదేశ్ ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వదేశీ దర్శన్, ప్రచార స్కీం పథకాలు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే పర్యాటక రంగ అభివృద్ధికి ఎంతో తోడ్పాటుని అందిస్తాయన్నారు. అలాగే టెంపుల్ టూరిజాన్ని అభివృద్ధి చేస్తామని, అరకు, లంబసింగి, బొర్రా గుహలను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతామని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

విరామం

=======================

విజయవాడ నగర ప్రజలను ముంపు నుంచి రక్షించడమే లక్ష్యంగా బుడమేరు విస్తరణ చేపడుతున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఆపరేషన్ బుడమేరు కార్యాచరణపై విజయవాడలోని జలవనరుల శాఖ క్యాంపు కార్యాలయంలో మంత్రి ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో నీటి పారుదల, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ సర్వే అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భవిష్యత్‌లో బుడమేరు నుంచి ఎలాంటి ముప్పు లేకుండా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారని మంత్రి తెలిపారు. అలాగే బుడమేరు ప్రవహించే చుట్టుపక్కల ప్రాంతాలు ఆక్రమణలకు గురయ్యాయని, అక్రమణలపై చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు.

========================

యువగళం పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీ మేరకు చిత్తూరు జిల్లా బంగారు పాళ్యంలో 3 కోట్ల రూపాయలతో డయాలసిస్ యూనిట్‌ను ఏర్పాటుచేస్తున్నామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. ఈరోజు బంగారు పాళ్యంలో పాత్రికేయులతో మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పాటై 100 రోజులు పూర్తయిన సందర్భంగా రేపు ఈ యూనిట్‌ను ప్రారంభించబోతున్నామని తెలిపారు. ఈ యూనిట్ ద్వారా రోజుకు 10 మంది కిడ్నీ రోగులకు డయాలసిస్ నిర్వహించే అవకాశముందన్నారు. అవసరాన్ని బట్టి భవిష్యత్‌లో యూనిట్ సామర్థ్యాన్ని పెంచుతామని మంత్రి హామీ ఇచ్చారు.

========================

దిగువ ట్రోపో ఆవరణంలో పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని, దీని ప్రభావంతో ఉత్తర, దక్షిణ కోస్తా, రాయలసీమలో కొన్ని చోట్ల రేపు వర్షాలు పడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేక రెండు చోట్ల కురిసే అవకాశముందని పేర్కొంది. గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది.

========================

ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 27న జరిగే అవార్డుల ప్రధానోత్సవానికి అర్హులైన పర్యాటక రంగాల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని అనకాపల్లి జిల్లా పర్యాటక అధికారి ఎస్వీఎస్ సుబ్బలక్ష్మి ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 38 విభాగాల నుంచి 41 అవార్డులకు దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. దరఖాస్తులను టూరిజం వెబ్ సైట్ www.aptourism.gov.in నుంచి డౌన్ లోడ్ చేసుకుని, పూరించిన తర్వాత విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ కార్యాలయ చిరునామాకు ఈ నెల 22లోగా అందజేయాలని కోరారు.

========================

అల్లూరి సీతారామరాజు జిల్లా సరిహద్దుల్లో మావోయిస్టు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు, ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నామని పాడేరు ఏఎస్పి దిరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏర్పాట్లో భాగంగా ఛతీస్‌ఘడ్ సరిహద్దు మండలంలో బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలతో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నట్టు తెలియజేశారు. ఈ సందర్భంగా మండల ప్రజలు పరిసరాలలో ఏవైనా అనుమానాస్పద వస్తువులు మనుషులు కనపడినట్లయితై.. స్థానిక పోలీసులకు తెలియజేయవలసిందిగా కోరారు. అదేవిధంగా మండల స్థాయి నాయకులు, అధికారులు సాధ్యమైనంత వరకు లోతట్టు గ్రామాలకు వెళ్లకుండా ఉండాలని సూచించారు.

========================

పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఈరోజు తోటపల్లిలో ఏర్పాటు చేసిన మన బడి - మన తోట కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉపాధ్యాయులకు ప్రకృతి వ్యవసాయంపై మరింత అవగాహన పెంచడం కోసమే మన బడి-మన తోట కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులకు ఆకు కూరలు, కూరగాయలు పండించడం నేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. చదువుకునే విద్యార్థులలో అధిక శాతం రక్తహీనతతో బాధపడుతున్నారని, వారికి మరింత పౌష్టికాహారం అందించాలని తెలిపారు. పండించిన సేంద్రియ ఆకుకూరలు, కూరగాయాల్లో అధిక పోషకాలు ఉంటాయని, వాటిని పిల్లలకు అందించడం వలస పిల్లల్లో హిమోగ్లోబిన్ పెరిగి, రక్తహీనత సమస్య తగ్గుతుందని కలెక్టర్ వివరించారు.

========================

రాష్ట్రంలో చాలా అక్రమ నిర్మాణాలు ఉన్నాయని, త్వరలోనే వాటిని తొలగిస్తామని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. ఈరోజు రాష్ట్ర సచివాలయంలో పాత్రికేయులతో మంత్రి మాట్లాడుతూ... గత ప్రభుత్వ హయాంలో చాలా అక్రమ నిర్మాణాలు చేపట్టారని, వాటిపై ప్రత్యేక దృష్టి సారించి కూల్చివేతలకు చర్యలు తీసుకుంటామన్నారు. జర్నలిస్టుల సమస్యలపై త్వరలోనే యూనియన్ నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

========================

కొబ్బరి ఆధారిత ఉత్పత్తులను మరింత పెంచడం ద్వారా రైతులకు ఆదాయం పెరగడంతో పాటు పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని రాష్ట్ర ఉద్యాన శాఖ సంచాలకులు ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా వెంకట్రామన్న గూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో కేంద్ర కొబ్బరి అభివృద్ధి బోర్డ్, కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా ఏర్పాటు చేసిన గృహ విజ్ఞాన, ఉద్యాన శాస్త్రవేత్తల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... కొబ్బరి ఆదారితత్పత్తులు మార్కెట్లో 2 శాతం మాత్రమే ఉన్నాయని, దీన్ని 10 శాతానికి పెంచాలనే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించామన్నారు.

========================

========================